శ్రీనివాసా బుక్ స్టాల్
ప్రొ॥ కె. యస్. వి. శ్రీనివాస్
మొగల్తూరు. బుక్ సి. నెం.

# వెలుగువర్షం

బైట తీక్షణంగా ప్రసరించే సూర్యకిరణాలని రవంతకూడా లోపలికి జొరపడనీయకుండావున్న చిక్కటి అడవి అది! అక్కడ వీస్తున్న గాలి ఒడలు జలదరింపచేసేట్టు వింతశబ్దాలు చేస్తోంది. నీడలు దట్టంగావున్న ఆచోట అది పగలేనని తెలియని యీలకోళ్ళు, స్వేచ్ఛగా, శబ్దంచేస్తూ, రాత్రి వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి.

అతి నిశ్శబ్దంగావున్న ఆ శబ్దంలో నా బూట్ల శబ్దం నాకే విచిత్రంగా వినిపిస్తోంది. నాకు అక్కడ చెట్లకి పెనవేసుకునివున్న లతల పచ్చదనం చూడముచ్చటగా వుంది. ఇంటిదగ్గరనుంచి బైలుదేరి వస్తుండగా అత్తయ్య అంది, 'సంజయ్! చీకటిపడకముందే యింటికి వచ్చేయి! ఆ అడవిలో చింత తోపులో దెయ్యం వుంది.'

కెమెరా తీసుకుని భుజానికి తగిలించుకుంటున్న నేను నవ్వుతూ అన్నాను, నిజంగానా! అయితే తప్పకుండా, చీకటిపడిం తర్వాతనే నేను ఆ చింతతోపులోనుంచి వస్తాను.'

'నీ చిన్నప్పటి మొండితనం రవంతకూడా మారలేదు' అత్తయ్య విసుక్కుంది.

'దెయ్యం కనిపిస్తుందా బావా?' అత్తయ్య చిన్నకొడుకు మురళి నా చేయిపట్టుకుని వుత్సాహంగా అడిగాడు.

'నా కళ్ళకి కనిపిస్తే ఫోటో తీస్తాను. నాకంటికి కనిపించిన ప్రతిదీ యీ కెమెరాలో బంధించగలను.' కెమెరాని చేత్తో తడుముతూ, సగర్వంగా అన్నాను.

'సంజయ్! నీకు పుణ్యం వుంటుంది. ఈ వూరు మంచిదికాదు. నీకు అవసరంలేని విషయాలలో జోక్యం కలుగచేసుకోకు! ఏదీ మీ పత్రికకోసం ఫోటోలు తీయటానికి వచ్చానన్నావు. నాలుగురోజులు మాతో సరదాగా గడిపావు! ఏ దెయ్యో, కాలో విరక్కొట్టుకోకుండా, మీయింటికి నువ్వు వెళితే అదే పదివేలు.'

'ఏం ఈవూరిదెయ్యం కాళ్లూ, చేతులూ విరగకొట్టి పంపిస్తుందా?' అన్నాను.

'నీకంతా పరిహాసమే!'

'నువ్వు దెయ్యాన్ని చూశావా అత్తయ్యా!'

'అమ్మో! చూడటమే! చూస్తే యింకా యిలా బ్రతికుంటానా! గుండె పగిలి అప్పుడే చచ్చిపోయి వుండేదాన్ని!' అత్తయ్య గుండెలమీద చేయివేసుకుని కళ్ళు పెద్దవిచేస్తూ అంది.

'ఎందుకు చచ్చిపోవాలి! దెయ్యం అనేదాన్ని భయంకరంగా, వికృతంగా మనం ఊహించుకోవడంతో, యీ భయం అంతా ఏర్పడుతోంది. దెయ్యం అంటె ఎవరు? ఆస్ట్రాల్? మనలాటి మనిషి అంశయేకదా.'

'ఏమో బాబూ! నువ్వు ప్రతిదీ యిలాగే తర్కం చేస్తావు. నీకు నేను జవాబు చెప్పలేను.'

'తర్కం కాదత్తయ్యా! ఒకసారి నీకు నువ్వే ఆలోచించుకో! దెయ్యాన్ని ఎప్పుడూ నువ్వు చూడలేదు. కనీసం చూసినవాళ్ళుకూడా ఎవ్వరూ నీకు తటస్థపడలేదు. దెయ్యం గురించి, ఎవ్వరో అన్నది, నువ్వు పదింతలుగా వూహించుకున్నది మాత్రమే. నిజం! నువ్వు భయపడేది దెయ్యానికికాదు. నీలోవున్న పిరికితనానికి.'

మురళి కుతూహలంగా నావైపు, తల్లివైపు చూస్తున్నాడు. వాడి కళ్ళలో తల్లిమాటలకి భయం, నా తర్కంపట్ల ఆసక్తి స్పష్టంగా కన్పిస్తోంది.

'బావా! నేనుకూడా నీతో రానా!' అన్నాడు.

'రాత్రివేళ చింతతోపునుంచి నాతోపాటు రాగల ధైర్యంవుంటే రా.'

'వాడా! ఒట్టి పిరికిసన్యాసి! వాడెందుకులే' అంది అత్తయ్య.

'వాడు పిరికివాడు కాదు. నువ్వు పిరికివాడిగా వాడిని తయారు చేస్తున్నావు' అన్నాను బైలుదేరుతూ.

'సంజయ్, త్వరగా వచ్చెయి' గేటు దాటుతుంటే, వరండాలోనుంచి అత్తయ్య మళ్ళీ హెచ్చరికగా కేకపెట్టింది.

'అలాగే' అన్నాను.

చాలా చిన్నపల్లెటూరు అది! అన్నీ కలిపి వందయిళ్ళుకూడా లేవు. కానీ ఆ వంద యిళ్ళలోనే కుల, మత, వివక్షత సుస్పష్టంగా వుంది. ఆ కొస్త వూరికే రెండు చిన్న దేవాలయాలు, ఒక మసీదు వున్నాయి. ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్ అది. మామయ్య ఫారెస్టు కంట్రాక్టర్‌గావచ్చి యిక్కడ స్థిరపడిపోయాడు. రెండేళ్ళక్రితమే సంసారం మొత్తం యిక్కడికి తరలించాడు. అత్తయ్య ఏదో నెపంమీద నెలకి ఒకసారి అయినా హైదరాబాదు వస్తూంటుంది. వచ్చినప్పుడల్లా 'మీ మామయ్య నన్ను తీసుకువెళ్ళి ఆ అడవిలో పడేశారు' అని ఫిర్యాదు చేస్తూనే వుంటుంది. ఆ వూరు చుట్టుపక్కల కమ్ముకున్న అడవి, ఆ నిశ్శబ్దం గురించి మామయ్య ఎప్పుడూ చెబుతూ వుంటాడు. నాకు ఎన్నాళ్ళనుంచో యీ వూరు రావాలని.

నేను 'నవభారత్' అనే పత్రికలో పదేళ్ళుగా పనిచేస్తున్నాను. ఆ పత్రికకి నెలనెలా, నేను నిర్వహించే ఫొటో ఫీచర్ హైలైట్! దేశంలో వున్న దుర్మార్గాన్ని, అరాచకాల్ని, మూఢనమ్మకాలను వాడిగా దుయ్యబట్టడం నాధ్యేయం. ఈ దేశంలో నాలాగా, పాతతరంతో, పాతసంప్రదాయాలతో, పేచీపడుతున్న కొత్తతరంవాళ్ళు చాలామంది వున్నట్టున్నారు. నేను నిర్వహించే యీ శీర్షిక, అత్యల్ప వ్యవధిలోనే, అందరినీ ఆకట్టుకుంది.

క్రమంగా 'నవభారత్'కి నా ఫొటో ఫీచర్ జీవనాడి అయింది. పత్రిక యాజమాన్యం నేను అడగకుండానే నా జీతం పెంచారు. నాకు ఈ దేశంలో ఏ మూలకి వెళ్ళాలన్నా, వారే సదుపాయం కలుగజేస్తారు.

ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క యిష్టం వుంటుంది. నాకు చిన్నప్పటినుంచీ ఫోటోలుపిచ్చి వుండేది. నా పన్నెండోఏట మానాన్న నాకు ఒక కెమెరా బహుమతిగా యిచ్చారు. ఆరోజున నేను పొందిన ఆనందం అనిర్వచనీయమైనది! నా జీవితానికి, ఈ కెమెరా అనేది ఒక రాచబాట వేస్తుందని, నా కుటుంబంలో ఎవ్వరూ అనుకోలేదు.

తర్వాత, తర్వాత ఫొటోగ్రఫీలో నాకెన్నో బహుమతులు వచ్చినాయి. క్రిందటి సంవత్సరమే ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్ లభించింది. ఇప్పుడు నన్ను ఎంతోమంది పత్రికలవాళ్ళు వుద్యోగం యిస్తాం రమ్మనమని పిలుస్తున్నారు. నాకు కార్లు యిస్తారట! మేడ యిస్తారట! నన్ను ఫారెన్ కరస్పాండెంటుగా పంపిస్తారుట. నాకు అవసరం లేదన్నాను. మేడలో కూర్చునే తీరుబడి, కారులో షికారు తిరిగే వ్యవధి నాకు లేనేలేవు! నేను ఒక దేశ సంచారిని! నా దేశంలో నేను చెయ్యగలిగినపని ఎంతో వుండగా, ఫారెన్ నే నెందుకు వెళ్ళాలి. నా యీ ఆలోచనలు వాళ్ళకి నచ్చలేదు. నాకు 'తిక్కశంకరయ్య' అనే బిరుదు యిచ్చారు. క్రితం నెలలో తన గోడౌన్‌లో దాచి వుంచిన బియ్యపు బస్తాలని, నేను ప్రాణాలకి తెగించి, దానిలో దూరి, ఫోటోలుతీసి, పేపరులోవేసి, సేఠ్ పన్నాలాల్‌ని పోలీసులకి పట్టించి నప్పుడు, అతను ఎలాగో అవస్థపడి విడిపించుకున్న తర్వాత, సరాసరి నా దగ్గరికి వచ్చాడు. కరచాలనంకోసం చేయి చాస్తూ, 'నేను అంత పకడ్‌బందీగా కాపలాపెట్టినాకూడా నువ్వు లోపలికి ఎలా వెళ్ళగలిగావో నాకు అర్థంగాలేదు' అని నా కెమెరాని, చూస్తూ 'సంజయ్! వేటగాడి చేతిలో తుపాకి చూస్తే అడవి మృగాలకి ఎంత భయమో, నీ చేతిలో యీ కెమెరా చూస్తే మాకంత భయం' అన్నాడు. ఆయన మాటల్లో ప్రశంసలేదు. యదార్థం ఒప్పుకునే నిర్భీతి వుంది. నాకెంతో ఆనందంగా అనిపించింది.

నేను నడుస్తున్నచోట రాను, రాను అడవి దట్టమై, నాచుట్టూ వ్యాపించినంత దగ్గరగా వుంది. తన అరచేతిలో నన్ను పట్టుకుని చూస్తోందీ అన్నంత చిక్కగా వుంది. దాన్ని చూస్తున్నకొద్దీ నామనసులో మిగతా ఆలోచనలు తొలిగిపోయి, ఏకాగ్రత రాసాగింది.

నేను అప్పుడప్పుడు, 'ఋతుగానం' అనే శీర్షికతో ప్రకృతిలో వున్న రకరకాల ఋతువుల్ని ఫోటోలు తీస్తాను. ఎప్పుడూ, యదార్థగాథలు, పచ్చి నిజాలు, వికృత వ్యవస్థలు తీసి, తీసి విసిగిపోయిన నాకు, ప్రకృతి ఆలపిస్తున్న రాగాల్లా వుండే, యీ ఋతువుల్ని తీయటం అంటే ఎంతో హాయిగా, ఆనందంగా వుంటుంది.

ఈసారి నేను నిర్వహిస్తున్న శీర్షిక పేరు 'నింగి_నేల' దీన్ని రకరకాల భంగిమల్లో తీయాలి. పత్రిక తెరిచిన ప్రతిమనిషి వయోవృద్ధ భేదం లేకుండా యీ ఫొటోలు చూడగానే, పరిసరాలు, తన సాధకబాధలూ మర్చిపోవాలి. నా చిటికెనవేలు పట్టుకుని, నేను తీసుకువెళ్తున్న సుదూర తీరాలకి, నాతోబాటు వచ్చేసేట్టుగా వుండాలి. పాఠకుడిని నేను చూడక పోయినా, నన్ను పాఠకుడు ఎరగకపోయినా, నేను అతనికి నా ఫోటోల ద్వారా ఈ ఆనందం పంచటం, అతను నాకు ప్రశంసని అందివ్వటం అనే అనుబంధం పెనవేసుకుపోవాలి.

మొదట, మొదట నేను ఈ వృత్తిలోకి ప్రవేశించినప్పుడు, నా ఆనందంకోసం నేను ఈ పనిచేసినా, రాను, రాను యిప్పుడు ఈ ఆనందం యింకొకరికి పంచుతున్నాను. నాకోసం వీరు, వారు నెలనెలా వేచి చూస్తున్నారనే ఆలోచన నాకెంతో ఆనందాన్ని పట్టుదలని కలిగిస్తోంది. సాధ్యమైనంత అందంగా ఈ ఫోటోలు తీసి, నా పాఠకుల్ని ఆనందపరచా లనేది నాకు తెలియకుండానే నాకు ఒక ధ్యేయం అయిపోయింది.

నేను ఒక ఎత్తయినచోటులో నిలబడి, కెమెరా భుజాన్నుంచి తీసి, కంటిదగ్గరగా పెట్టుకుని, ఆ అడవి అంతా చూడసాగెను! చెట్లకొమ్మలు చిరుగాలికి అలవోకగా తలలాడిస్తున్నాయి. కెమెరాలోనుంచి అతి

నాజూకుగావున్న పూలు ఎంతో అందంగా కన్పిస్తున్నాయి. కొన్ని కొన్ని అడవితీగెలు, మనిషిని పెనవేసుకున్న మూఢనమ్మకాల్లా ఛాందసభావాల్లా అతి దట్టంగా పెరిగివున్నాయి.

అటు, యిటూ అజంతా సుందరి శరీరంలో, ఒంపు సొంపులు అతి జాగ్రత్తగా గమనిస్తున్న ఆర్టిస్టులా, ఆ అడవి అందాలు వెతుకుతున్నట్టుగా, అతి మెల్లగా కదులుతున్న నా కెమెరా ఒకచోట ఆగిపోయింది. నేను ఎత్తు ప్రదేశంలో నిలబడి వున్నాను. అక్కడనుంచి దిగువగా, దాదాపు లోయలా వున్న ఆచోట ఒక నీటిచెలమ వుంది. చుట్టూ కమ్ముకునివున్న చెట్ల శిఖరాగ్రాలని ఎలా తప్పించుకుని జొరబడ్డాయో సూర్యకిరణాలు, ఆ నీటిమీద పడి తళతళ మెరుస్తున్నాయి.

నేను క్షణంసేపు సర్వం మర్చిపోయినవాడిలా, ఆ సుందర దృశ్యం చూస్తున్నాను. పచ్చటి కొమ్మలమధ్యనుంచి. దూసుకువస్తున్న ఆ కాంతి నింగినుంచి వచ్చి నేలని తాకుతున్న వెలుగు నావలా వుంది. నేను జాగ్రత్తగా, కెమెరాని ఎడ్జస్ట్ చేసి, అత్యంత ఏకాగ్రతతో దాన్ని ఫొటో తీస్తున్నాను.

ఇంతలో ఎక్కడో భౌ భౌ మన్న కుక్క అరుపు వినిపించింది. ఆ వెంటనే అతి భయానకమైన శబ్దం అయింది. అది నకిలింపో, యికిలింపో అర్థంగానంత దారుణంగా వుంది. ఆ శబ్దం చేసింది మనిషో, మృగమో తెలియలేదు. యదాలాపంగావున్న నేను వులిక్కిపడ్డాను. ఆ భయంకర శబ్దం, అతి నిశ్శబ్దంగావున్న ఆ అడవిలో మారుమోగి ప్రతిధ్వనించింది. నేను ఫొటో తీయడం మానేసి చుట్టూచూశాను. ఎక్కడా ఏ అలికిడీ వినిపించలేదు. ఆ క్షణంలో ఆ అడవికూడా నాలాగే వూపిరిబిగబట్టి చూస్తోందా అన్నంత మౌనంగా, నిశ్శబ్దంగా వుంది.

నేను కెమెరాతో చూస్తూ ఆ శబ్దం ఏమూలనుంచి వస్తోందా అన్నట్టు వెతకసాగాను. ఎంత సేపటికీ మళ్ళీ ఎలాటి చప్పుడూ అవలేదు. ఇంతలో మువ్వలగంటలు మోగుతున్న శబ్దం దూరంనుంచి వినిపించింది. అది రానురాను దగ్గరైంది – రెండెడ్లబండీ ఒకటి వస్తోంది! ఇసకలో బండి

చక్రాలు సక్రమమన్న చప్పుడు, ఎడ్ల కదలికలో, మెడలో మువ్వలపట్టీ జంటగా లయగా ప్రతిధ్వనిస్తోన్నాయి. సూర్యాస్తమయం కావస్తోంది. బండి అతను, అడవిలోనున్న నిశ్శబ్దాన్ని భంగపరచాలి అన్నట్టుగా, అవసరం లేకపోయినా, 'హై, హై. నడు, నడు' అని ఎడ్లని అదిలిస్తున్నాడు.

ఇంతలో హఠాత్తుగా, మళ్ళీ కుక్క అరుపు వినిపించింది. దానితో కలిపి, అతి భయంకరంగావున్న ఆ శబ్దం మళ్ళీ అడవి నిశ్శబ్దాన్ని చీలుస్తున్నట్టుగా ప్రతిధ్వనించింది. ఆ అరుపుకి ఎడ్లు బెదిరినట్టుగా, అడుగు ముందుకు వేయలేనట్టు ఆగిపోయినాయి.

బండిలోనుంచి ఘొల్లున ఆడవాళ్ళ ఏడుపు వినిపించింది.

'అమ్మగారూ ! అమ్మగారూ ! అమ్మగారూ !' బండిఅతను గొడవగా పిలుస్తున్నాడు. అస్పష్టంగా మాటలు వినిపించాయి.

బండి ఆగిపోయింది. ఆడవాళ్ళు ఉన్నారు. గలభాగా వుంది. నేను కెమెరా మూసి, బండిదగ్గరికి వెళ్ళాను.

'అమ్మా ! కమలా ! కమలా !' పెద్దావిడ గొంతు ఏడుస్తూ పిలుస్తోంది.

'అక్కా, అక్కా' చిన్నపిల్ల గొంతు వినిపించింది.

'ఏమిటి ? ఏమైంది ?' వాళ్ళదగ్గరకి వెళ్ళి అడిగాను.

బండిఅతను నన్ను గుర్తుపట్టాడు. ప్రాణం లేచివచ్చినట్టుగా చూస్తూ, 'బాబుగారూ ! మీరా ! ఆ దెయ్యం అరుపులకి మా అమ్మగారు మూర్ఛపోయారండీ, అసలే బాలింతరాలు' అన్నాడు. నేను బండిలోకి తొంగి చూశాను. పాతికసంవత్సరాల యువతి ఫిట్ వచ్చినట్టుంది – నోటవెంట చొంగ కారుతోంది. గుప్పెట్లు బిగిసి వున్నాయి. కాళ్ళూ, చేతులూ గిలగిలా కొట్టుకుంటోంది. పక్కనున్న పెద్దావిడ పసిబిడ్డని ఎత్తుకుంది. ఆవిడ ముఖంలో భయం స్పష్టంగా కన్పిస్తోంది.

'ఓరి దేవుడా ! ఈ దెయ్యం నాబిడ్డని పొట్టనెట్టుకుందిరా' అంటోంది.

'మీరు ఆ పాపాయిని నాకిచ్చి ఆవిడని పట్టుకోండి' అన్నాను.

ఆవిడ పసిపిల్లని నాకిచ్చి, కూతురి కాళ్ళూ, చేతులూ కదలకుండా పట్టుకుంది. నేను బిడ్డని ఎత్తుకుని 'బండిపోనీ' అన్నాను. బండి కదిలింది. నేను బండివెంట నడిచాను.

బండి ఆ వూరి పూజారి యింటి ముందు ఆగింది. ఆ ఫిట్ వచ్చిన అమ్మాయి పూజారి కోడలట! ఆ పెద్దావిడ ఆ అమ్మాయి తల్లి. బండి చూడగానే, పూజారి పరుగెత్తుకువచ్చాడు. మూర్ఛపోయిన కోడలిని కొడుకు సాయంతో దింపి లోపలికి చేర్చారు. ఏదేదో వైద్యం చేస్తున్నారు. చిన్న పల్లెటూరేమో, నిమిషాలమీద పూజారిగారి కోడలిని దెయ్యం ఆవరించిందనే వార్త అందరికీ తెలిసిపోయింది. ఆడ, మగా, చిన్నా, పెద్దా - చేస్తున్న పనులు వదిలి, బిలబిలలాడుతూ వచ్చి ఆ యింటిముందు మూగారు.

వారిలో ఒకతనికి పూనకం వచ్చింది. అతను గణాచారిట! ఆ దెయ్యం తరచుగా, అతని ఒంటిమీదకి వచ్చి, ఆ వూరివాళ్ళు తనకి చేయవలసిన మర్యాదలు గురించి ఆజ్ఞలు జారీ చేస్తుందిట! గణాచారికి పూనకం రాగానే పూజారి అతనిముందు నేలమీద సాష్టాంగపడ్డాడు. 'అమ్మా, చెప్పు! నీకేం కావాలి! నాకోడలిని వదలు. నీ కాళ్ళు పట్టుకుంటాను' పూజారి గణాచారి కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు.

'ఒరేయ్! నీ మనుమరాలికి నాపేరు పెట్టలేదురా! ఇది నాకు అవమానం. నాపేరు పెట్టాలని చెప్పానుగా.'

'పొరపాటయింది తల్లీ నీ పేరే పెట్టుకుంటాం సరేనా' ఫెడీ, ఫెడీ చెంపలు వేసుకున్నాడు.

'పౌర్ణమినాడు సంతర్పణ చేయాలిరా.'

'అలాగే!'

గణాచారి వూగాడు. వేపమండలు వూపారు. మంచిగంధం రాచారు.

నేను అతని పూనకాన్ని వినోదంగా చూస్తున్నాను. నాకు ఆ గణాచారిని చూస్తుంటే, మనుష్యులు మామూలుగా వుండకుండా కొంతమంది ఎందుకిలా అవుతారా అనిపించసాగింది. అతను కళ్ళు మూసుకుని

పూగుతుండగా వివిధ భంగిమల్లో ఫొటోలు తీశాను. ఆడవాళ్ళు ఆతనికి హారతులు యిస్తున్నారు. కొబ్బరికాయలు కొడుతున్నారు. ఏమిటేమిటో అడిగి జవాబులు చెప్పించుకుంటున్నారు.

పూజారిగారి యింటి ముందు సందడి సద్దుమణిగి, ఎక్కడివారు అక్కడికి వెళ్ళేసరికి రాత్రి పదిగంటలు అయింది.

అత్తయ్య మాకు భోజనం వడ్డించింది.

మురళీని కాళ్ళు కడుక్కుని రమ్మంటే, దొడ్లోకి వెళ్ళటానికి భయపడ్డాడు. నేను తోడు వెళ్ళాను. అయినా వాడి చూపులు ఎదురుగానే వున్నాయి. సరిగ్గా కడుక్కోకుండానే ఒక్క అంగలో లోపలికి వచ్చేశాడు.

అత్తయ్య నాకు నెయ్యి వడ్డిస్తూ అంది. 'చూశావా! దెయ్యాలు, గియ్యాలు ఏమీ లేవన్నావు. ఇప్పుడైనా ఒప్పుకుంటావా?'

అన్నం తింటున్న నేను వెంటనే జవాబు చెప్పలేదు.

'ఏం? మాట్లాడవేం?'

'ఏం మాట్లాడతాడే?' అన్నాడు మామయ్య.

'మామయ్యా! నువ్వుకూడా ఆ దెయ్యం గురించి నమ్ముతావా?'

'అందరూ నమ్ముతుంటే, నే నెందుకు నమ్మకుండా వుండాలి. నమ్మాను అంటే సరిపోలా.'

అత్తయ్య నావైపు సగర్వంగా చూసింది.

నేను మంచినీళ్ళు తాగి గ్లాసు క్రిందపెడుతూ అన్నాను, 'సరే అత్తయా! మీ వూళ్ళో దెయ్యంవున్నమాట నిజమే! నేను ఒప్పుకుంటాను. కానీ నే దాన్ని కళ్ళారా చూసిగానీ, యీవూరినుంచి వెళ్ళను. సరేనా!'

అత్తయ్య నావైపు విచిత్రంగా చూసింది.

ఆ రాత్రి —

అత్తయ్యకూడా భోజనం ముగించుకుని కూర్చుని తమలపాకులు వేసుకుంటుండగా, వచ్చి ఆవిడ కెదురుగా కూర్చుంటూ అడిగాను. 'అత్తయ్యా ఆ దెయ్యం ఆడదని మీకెలా తెలుసు?'

7 O 6/81

'ఎందుకు తెలియదు? ఆ దెయ్యం ఎవరో, ఏమిటో, అస లావ్య క్తి ఎందుకు దెయ్యం అయిందీ, యీ వూళ్ళో పాలుతాగే పిసిపి ల్లకికూడా తెలుసు.'

'నేను యీ వూరివాడినికానుగా, నాకు తెలియదు. చెప్పు' అన్నాను.

అ త్తయ్య తమలపాకులకు సున్నం రాచి చీలుస్తూ చెప్పసాగింది.

'ఆ దెయ్యం పేరు సావిత్రి. సావిత్రి అంటే ఈ వూరిలో సాతాని గోపయ్య కూతురు. చిన్నప్పుడే పెళ్ళిచేసి అ త్తవారింటికి పంపారు. మూడోనాటికి మొగుడుపోయి ముండమోసి పుట్టింటికి వచ్చింది. ఈ వూరు ఒక సన్యాసి వచ్చాడు. అతనితో సావిత్రికి సంబంధం ఏర్పడింది. సావిత్రి అతనిదగ్గర బాగా మంత్రాలు, తంత్రాలు నేర్చింది. ఆ సాధువు పెళ్ళిపోయిన తర్వాత, ఈ వూరివాళ్ళమీద ప్రయోగించటం ప్రారంభించింది. అందరూ కొన్నాళ్ళు భయంతో భరించారు. చివరికి రాళ్ళతోకొట్టి చంపారు. చచ్చిం తర్వాత మరీ పగబట్టింది. దెయ్యమై యీ వూరి వాళ్ళని పీక్కు తింటోంది. అప్పుడు మనిషి కాబట్టి చంపగలరు. ఇప్పుడు దెయ్యాన్ని ఏం చెయ్యగలరు? సావిత్రి బ్రతికి వుండగా దానిదగ్గర ఒక న ల్లటి కుక్క వుండేది. అది యిప్పుడు ఆ అడవిలోనే తిరుగుతూ వుంటుంది. ఆ కుక్కని చూ స్తే అందరికి భయమే!'

ఈ కథ నాకు చిత్రంగా, గమ్మత్తుగా వుంది.

నేను లేచి పడుకోవటానికి వెళుతుంటే అ త్తయ్య వెనకనుంచి అడిగింది, 'ఫోటోలు తీసుకోవడం అయిందా! వూరు ఎప్పుడు వె ళ్తున్నావు?'

'ఇంకా రెండు మూడు మిగిలినాయి. అవి తీసుకోగానే వెళ్ళిపోతాను' అన్నాడు.

మర్నాడు మళ్ళీ అడవిలోకి వెళ్ళాను. ఆ నీటి చెలమని ఫోటో తీయటానికి ఆ ఎత్తుప్రదేశంమీద నిలబడ్డాను. నేను కెమెరాలోనుంచి తదేకంగా చూస్తున్నాను. సూర్యకిరణాలు నిన్న అంత అందంగా పడటం లేదు. మెల్లగా అటుయిటు కదులుతున్న నా కెమెరా హఠా త్తుగా

ఆగిపోయింది. అంతవరకూ నిశ్శబ్దంగావున్న నీళ్ళు కదలసాగాయి. దానికి కారణం ఏమిటా అన్నట్టు కెమెరాతోనే ఆ జాగా అంతా వెతకసాగాను. కుడివైపున నీళ్ళు కదులుతున్నాయి. నేను తదేకంగా అటే చూస్తున్నాను. నీళ్ళమీద నల్లగా ఏదో తేలుతూ కనిపించింది. అది నల్లటిజుట్టు అని కాసేపటికి అర్థం అయింది. తర్వాత మెల్ల మెల్లగా శరీరం పైకి తేలింది. సన్నగా వున్న ఒక యువతి నీళ్ళలోనుంచి పైకిలేచింది. చెట్టుచాటున కుండ తీసుకుని, నీళ్ళు ముంచుకుంది. ఆ నీళ్ళకడవ తీసుకుని, నీళ్ళలోనుంచి దట్టంగావున్న చెట్లలోకి వెళ్ళింది. ఆమెవెంట నల్లటికుక్క వెళ్ళింది. అంతా త్రుటిలో జరిగిపోయింది. ఎవరా యువతి? అడవిలో ఒంటరిగా ఎలా వుంటోంది. నేను ఆ నీటిచెలమ దగ్గరికి వెళ్ళాలని చూశాను. కానీ ఆ చెట్లు, తీగెలు బొత్తిగా అసంభవం అని నిరూపించినాయి. మరి ఆ అమ్మాయి అక్కడికి ఎలా వెళ్ళింది.

ఆ సాయంత్రం రాగానే అత్తయ్యకి యీ వార్త వినిపించాను. అత్తయ్య ముఖం వెల వెల పోయింది.

'నువ్వు మళ్ళీ ఆచోటుకి వెళ్ళకు' అంది.

'ఎందుకని? నేను ఆ అమ్మాయి ఎవరో తెలుసుకుని తీర్తాను' అన్నాను.

అత్తయ్య భయంగా చూస్తూ నాచేయి గట్టిగా పట్టుకుంది. 'సంజయ్! నీకు పుణ్యం వుంటుంది. మళ్ళీ పొరపాటుగాకూడా అలా అనకు. నీకు కనిపించినవ్యక్తి మనిషికాదు. సావిత్రి. దెయ్యం. అప్పుడప్పుడు యీ వూరివాళ్ళకి అలాగే కన్పిస్తూ వుంటుంది.'

'నాన్సెన్స్!' అన్నాను. ఆ అమ్మాయి సావిత్రా! చచ్చిపోయిన సావిత్రి కంటికి ఎలా కన్పిస్తుంది! అసంభవం అనుకున్నాను.

అడవిలోకి వెళ్ళనని అత్తయ్యకి వాగ్దానం చేశానే కానీ, వెళ్ళకుండా వుండలేకపోయాను.

నాకు సావిత్రి కన్పించిందనే వార్త మా అత్తయ్యద్వారా అప్పటికే వూరంతా తెలిసిపోయింది.

వరసగా రెండురోజులు వెళ్ళి అక్కడే కాపలా వేశాను. ఈసారి నా వెంట మామయ్య, పూజారిగారూకూడా వచ్చారు. కానీ ఎంతసేపు కూర్చున్నా మా కెవరూ కనిపించలేదు. మూడోరోజు వాళ్ళు రాలేదు. నేనే వెళ్ళాను. కెమెరాతో చూస్తుంటే అక్కడ యిసకలో పాదాల గుర్తులు కనిపించినాయి. ఆ వ్యక్తి వచ్చి వెళ్ళిపోయిందన్నమాట! అవునూ! దెయ్యాలు గాలిలో ఎగురుతాయి అంటారే! పాదాలతో మనుష్యుల్లా నడుస్తయ్యా! నేను నిరాశ చెందకుండా రోజూ అడవికి వస్తూనే వున్నాను. రోజూ కొద్ది కొద్దిగా కొమ్మలు నరికి, ఆ నీటిచెలమవైపు దారి చేస్తున్నాను. ఒకరోజు యిలా చేస్తుండగా, హఠాత్తుగా వెనకనుంచి నా నెత్తిమీద ఫెడేలుమని బలంగా దెబ్బపడింది. నేను కెవ్వుమని రెండుచేతులతో నెత్తిమీద పట్టుకున్నాను. మరు నిమిషంలో నా చేతులు రెండూ తడిగా అయినాయి. నా తలలోనుంచి రక్తం రాసాగింది. అది నా నుదుటిమీదకి, చెవుల ప్రక్కలకి, నీళ్ళలా కారుతోంది. నేను ఎంతో ప్రయత్నంమీద, ప్రాణాలు బిగపట్టినట్లుగా నడుస్తూ యింటికి వచ్చాను. రక్తసిక్తమైన బట్టలతోవున్న నన్ను చూడగానే అత్తయ్య చేసిన గొడవ అంతా యింతా కాదు.

'ఇది ఆ దెయ్యం చేసిన పనే' అని ఆవిడ నమ్మకం.

ఈ మూఢనమ్మకాలనుంచి వాళ్ళకి విముక్తిలేదు.

మామయ్య ప్రక్కవూరు తీసుకెళ్ళి నాతలలో కుట్లు వేయించి కట్టు కట్టించి తీసుకువచ్చాడు.

అత్తయ్య నాపెట్టెలో బట్టలన్నీ సర్దింది; రైల్వేస్టేషన్‌కి బండీ సిద్ధం చేయించింది.

'సంజయ్! ఈవూళ్ళో నువ్వు యిక ఒక్కక్షణంకూడా వుండటానికి వీలులేదు. వెంటనే వెళ్ళిపోవాలి' అంది.

'ఎందుకని అత్తయ్యా! దెయ్యానికి భయపడా!'

'నీకు నేను జవాబు చెప్పలేను. దయయుంచి వెళ్ళిపో!'

'నేను చూసిన వ్యక్తి నిజంగా దెయ్యమే అని ఋజువైతే, నేనే వెళ్ళిపోతాను. నువ్వు చెప్పనవసరంలేదు.'

జ్వరంతోవున్న నన్ను వెళ్ళిపొమ్మనటానికి మామయ్య మనసు అంగీకరించలేదు గాబోలు, 'జ్వరం తగ్గగానే పంపించివేద్దాంలే' అన్నాడు.

రెండురోజుల్లో జ్వరం తగ్గింది. తలకివున్న కట్టు వూడదీసేశాను. సావిత్రి దెయ్యం నన్ను చావుదెబ్బ కొట్టిందని తెలియగానే, వూరు వూరంతా చూడటానికి తరలివచ్చింది.

గణాచారికూడా వచ్చాడు.

'నిజంగా మీకు దెయ్యం కనిపించిందా బాబూ!' అని అడిగాడు.

పూసకం లేకుండావున్న యితన్ని చూస్తే గమ్మత్తుగా వుంది. కళ్ళ కొనలువరకూ కాటుక దిద్దుకున్నాడు. నుదుటన వైష్ణవనామాలు పెట్టుకున్నాడు. జుట్టు పొడుగ్గా పెంచుకున్నాడు. హఠాత్తుగా చూస్తే హరిదాసులా వున్నాడు.

'నువ్వు అడవిలోకివస్తే నీకుకూడా చూపిస్తాను' అన్నాను.

అప్పటికే ఆ వూళ్ళో చాలామంది అడవిలో కొమ్మల చాటుగావున్న ఆ నీటిచెలమని చూసి వచ్చారుట!

'సావిత్రి బ్రతికి వున్నప్పుడు నీకు తెలుసా?' అన్నాను.

'తెలుసు. చాలా మంచిపిల్ల. ఈ వూరివాళ్ళే బలవంతంగా చంపేశారు' అన్నాడు.

ఆరోజు సాయంత్రం నేను మళ్ళీ అడవిలోకి బయలుదేరాను! మధ్యాహ్నం అంతా బాగా ఎండ కాసింది. నేను అడవిలోకివచ్చి ఫోటోలు తీసుకున్నాను. చూస్తుండగానే చీకటిపడింది. నేను యింటికి బైలుదేరు తుండగా, ఆ చుట్టుప్రక్కల ప్రదేశం చీకట్లు కమ్ముకుంది. హఠాత్తుగా పెద్ద వర్షం రాసాగింది. మెరుపులు, వురుములతో వాతావరణం భయంకరంగా అయింది. నేను దారి తప్పాను! ఆ అడవిలో నే నెటు వెళుతున్నానో నాకే తెలియటంలేదు. తిరిగి తిరిగి కాళ్ళు నొప్పులు పుట్టినాయి.

ఎత్తుమీద నడుస్తున్న నాకు హఠాత్తుగా కాలు జారింది. నా కేమయిందో తెలుసుకునే లోపలే కొన్ని గజాలు దొర్లిపోయాను. నే నెక్కడికి జారానో నాకే తెలియలేదు. కాళ్ళూ, చేతులూ స్వాధీనంలో వున్నాయా లేదా అని చూసుకున్నాను. బాగానే వున్నాయి. మెడలో కెమెరా తడుముకున్నాను. అది యధాస్థానంలో వుంది! నేను కూర్చున్నాను. నాచేతిలో బ్యాటరీలైటుకూడాలేదు. క్షోణీపాతంగా పడుతున్న యీ వాన తగ్గేవరకూ వేచి చూడటం మినహా నా కింకేమార్గం కనిపించలేదు.

ఉన్నట్లుండి మెరుపు మెరిసింది. నా కళ్ళముందు, నీటిచెలమ జిగేల్ మని మెరిసి మాయమైంది. నేను తెల్లబోయాను. ఆనందం, భయం, ఆందోళన నన్ను చుట్టుముట్టినాయి. నేను కాలుజారి దొర్లడంతో నీటిచెలమ దగ్గరకి వచ్చాను. నేను చూసినది యదార్థం అవునా కాదా!

లేచి నాలుగుఅడుగులు వేశాను. కాళ్ళకి నీళ్ళు తగిలినాయి! సందేహంలేదు.

మళ్ళీ చటుక్కున ఒక మెరుపు మెరిసింది. నాకు అభిముఖంగా చెట్లసముదాయం కనిపించింది. నేను వాటిని గుర్తుపెట్టుకుని గుడ్డివాడిలా చేతులతో తడుముకుంటూ అటు నడవసాగాను.

చెట్లదగ్గరకి వచ్చిన నాకు సుదూరంగా, వెలుతురు కనిపించసాగింది. నేను ప్రాణం లేచివచ్చినట్టుగా, చెట్లతీగలని తప్పించుకుంటూ, ఆ వెలుగు రేఖలవైపు నడవసాగాను.

దగ్గరికి వచ్చినకొద్దీ అది ఒక పాడుపడిన దేవాలయంలా సుస్పష్టంగా తెలియసాగింది. నేను చూసిన ఆ కాంతి గుడిలోపలనుంచి వస్తోంది. అది మంటలా రెపరెపలాడుతోంది.

వానధారలు నా తలలోనుంచి బుగ్గలమీదకి, పెదవులమీదకి జారుతున్నాయి. నేను వాటిని చేత్తో తుడుచుకుంటూ, వడివడిగా అటువైపు వెళ్ళాను.

లోపలనుంచి మాటలు విన్పిస్తున్నాయి! ఇక్కడ మనుష్యు లున్నారు, ఫర్వాలేదు — అనే ధైర్యం వచ్చింది. మెట్లెక్కబోతున్న నేను హఠాత్తుగా ఆగిపోయాను.

లోపల వాళ్ళు మాట్లాడుకోవటంలేదు. పోట్లాడుకుంటున్నారు.

ఒక స్త్రీకంఠం ఏడుపుతో అర్థిస్తున్నట్టుగా అంటోంది.

'నీకు పుణ్యం వుంటుంది. ఇక్కడ యింకా యిలాగే కొద్దిరోజులుంటే నాకు పిచ్చెక్కుతుందేమోనని భయంవేస్తోంది. ఈ దెయ్యపు బ్రతుకు బ్రతుకలేక చచ్చిపోతున్నాను. రోజులతరబడి, ఒక్కదాన్ని యీ గుళ్ళో వుండటం నావల్లకావటంలేదు. నన్ను తిరిగి వూరికి రానీ! నేను బ్రతికే వున్నానని చెప్పనీ.'

'సావిత్రీ! మతిపోయినట్టు మాట్లాడకు. నువ్వు చచ్చిపోయావని, దెయ్యమైనావని వాళ్ళందరూ అనుకొంటున్నారు. ఈసారి నువ్వు కనిపిస్తే ప్రాణాలతో వదలరు.'

ఆ పురుషకంఠం నాకు చిరపరిచితమే కానీ ఆ వ్యక్తి ఎవ్వరో వెంటనే గుర్తు రావటంలేదు.

సావిత్రి ఏడుస్తున్న ధ్వని వినిపించింది.

'ఎందుకు ఏడుస్తున్నావు?'

'నేను ఆరోజు వూరివాళ్ళు నా గుడిసె తగులపెట్టినప్పుడే ఎందుకు చచ్చిపోలేదా అనుకుంటున్నాను.'

'ఇప్పుడు నీకేమైంది?'

'ఏమైందా? రోజుల తరబడి యీ పాడుబడ్డగుళ్ళో, ప్రేతంలా బ్రతుకు వెళ్ళదీయాలంటే, నేను ఎంత యాతనపడుతున్నానో తెలుసా?'

'నేను వస్తూనే వున్నానుగా.'

'వస్తూనే వున్నావు, వారానికో, పదిరోజులకో ఒకసారి! ఇట్లా ఒంటరిగా వుండాలంటే నాకు భయంవేస్తోంది. ఏ దొంగయినావస్తే, ఏ పురుగైనా నన్ను కరిస్తే! నాకు దిక్కేమిటి?'

'ఈ ఛాయలకి మానవమాత్రు లెవరూ రారు.'

'అట్లాగే చెప్పి నమ్మించావు. మరి ఆ ఫోటోలుతీసే అబ్బాయి ఎలా వచ్చాడు?'

'వాడో క్రూరాత్ముడు. అందుకే నెత్తిమీద చావబాది బుద్ధిచెప్పానుగా.'

'నా కేమిటో భయంవేస్తోంది.'

'నన్నేం చేయమంటావు చెప్పు.'

'నేను నిజంగా కావాలని వుంటే నేను చనిపోలేదని వూరివాళ్ళకి చెప్పు.'

'అమ్మో ! నావల్లకాదు – నన్ను చంపేస్తారు.'

'వస్తా ! రేపువస్తానులే ; పొద్దుపోయింది. పడుకో' నేను చీకట్లోంచే తొంగిచూశాను.

ఆ మెట్లుదిగి వస్తున్నది గణాచారి.

నేను చీకటిలోకి తప్పుకున్నాను. గణాచారి బ్యాటరీలైటు వెలుగులో గొడుగు వేసుకుని వెళ్ళిపోతున్నాడు.

అతను బాగా దూరం అయింతర్వాత నేను గుడిలోకి తొంగిచూశాను. అక్కడ పొయ్యి మండుతోంది. దాని వెలుగులో ఒక స్త్రీ నేలమీద కూర్చుని మోకాళ్ళమీద తల ఉంచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేను ధైర్యంచేసి, గడపదాటి లోపలికి అడుగుపెట్టాను. ఆ గదిలో గోడవారగా, నల్లరాతితో అతిభీకరంగావున్న కాళిక విగ్రహం వుంది. దాని కెదురుగా గోడవారగా పొయ్యి. ఆ పొయ్యి కెదురుగా జుట్టు విరబోసుకుని ఏడుస్తున్న స్త్రీ.

నా వునికిని తెలియచేస్తున్నట్టుగా నేను గొంతు సవరించుకున్నాను ; ఏడుస్తున్న ఆ యువతి తలెత్తి చూసింది. ఆ చూపులు నన్ను చూసిన మరుక్షణంలో బిత్తరపోయినాయి. చటుక్కున లేచి నిలబడింది.

'ఎవరు నువ్వు ?' కళ్ళు పెద్దవిచేస్తూ అంది.

'సంజయ్‌ని. ఫోటోగ్రాఫర్‌ని.'

ఆ యువతి నావైపే చూస్తోంది. పెద్దకళ్ళు, రెప్పలు వెడల్పు చేయడంతో ఆల్చిప్పల్లా యింకా పెద్దవిగా వున్నాయి. ముఖాన పెద్దబొట్టు, జుట్టు విరబోసుకుని వుందేమో, ఒక్కక్షణం ఆ కాళికాదేవి ప్రాణం

పోసుకుని వచ్చిందా అన్నట్టు నా శరీరం జలదరించింది. నేను చేతులు జోడించాను. 'వానపడుతుంటే దారితప్పి వచ్చాను. నావల్ల మీకు ఏ హానీ జరగదు. భయపడకండి' అన్నాను.

ఆ అమ్మాయి ముఖం తిప్పుకున్నట్టుగా పక్కకు జరిగింది. చటుక్కున వంగి, మండుతున్న పొయ్యిలోపలి కట్టె ఒకటి తీసి నామీద గిరాటు వేసింది. నేను మెరుపులా పక్కకి తప్పుకోకపోతే అది సరాసరి నా ముఖానికి వచ్చి తగిలి వుండేదే!

'ఎవరు నువ్వు, ఎందుకు వచ్చావు? నేను దెయ్యాన్ని. నా కంటపడిన వాళ్ళెవరూ ప్రాణాలతో బ్రతికిబయటపడరు. నీకు తెలియదా' అంటూ నామీద కురికింది. సావిత్రి చేతులు నా కంఠం పట్టుకున్నాయి. ఆ పట్టు విడిపించుకోవటానికి నేను సావిత్రిని ఎడా, పెడా బలంగా కొట్టాల్సివచ్చింది. ఒక ఆడపిల్లని కొడుతున్నానే అనే బాధకంటే, ప్రాణరక్షణ ముఖ్యం అనిపించింది.

సావిత్రి నా దెబ్బలకి క్రిందపడింది. నేను చేయిపట్టి లాగాను.

'దెయ్యానివైతే గాలిలో ఎగిరిపో. వెళ్ళవే! నన్ను ముట్టుకోకుండానే నా నోటివెంట రక్తం పడేట్టు చెయ్యి. చెయ్యవే మరి' అన్నాను.

సావిత్రి ఏడవసాగింది.

'నువ్వు ఎవరు? ఎందుకిలా వుంటున్నావు? నీ విషయం వూళ్లో వాళ్ళకి చెబుతాను. నువ్వూ, గణాచారి కలిసి దెయ్యం అనే అభూతకల్పనతో యీ వూరివాళ్ళందరినీ భయభ్రాంతుల్నిచేసి నాటకం ఆడుతున్నావన్నమాట. నేను పోలీసు రిపోర్ట్ చేస్తాను.'

సావిత్రి హఠాత్తుగా నాకు చేతులు జోడించింది. 'మీకు పుణ్యం వుంటుంది. నే నిక్కడ బ్రతికివున్నానని ఎవ్వరికీ చెప్పకండి.'

'ఏం! ఎందుకని?'

'దానికి జవాబు తెలుసుకోవాలంటే మీరు చాలా ఓపికతో వినాలి.'

'చెప్పు. నేను వినటానికి సిద్ధంగా వున్నాను.'



కథా నిలయం 4826

'మీ రెవరో నాకు తెలియదు. కానీ యీ క్షణంలో చూస్తే దేవుడిలా కన్పిస్తున్నారు. నేను బ్రతికి వున్నాననే విషయం మరోమనిషికి తెలియాలని తపిస్తున్నాను. మీరు మన్నిస్తానంటే నా కథ చెపుతాను.'

'చెప్పు' అన్నాను.

సావిత్రి చెప్పటం ప్రారంభించింది —

'మాది యీ వూరే! మా నాన్న భూతవైద్యుడు. చుట్టుప్రక్కల వూళ్ళలో అందరూ ఏ బాధవచ్చినా ఆయనదగ్గరికివచ్చి విభూది పట్టుకుని వెళ్ళేవారు! ఆయన యిచ్చిన ఆ బూడిదకి ఆ వ్యాధులు నయం అయేవో లేదో నాకు తెలియదు కానీ, మా నాన్న అంటేమాత్రం ఆ చుట్టుప్రక్కల జనం అంతా గడగడలాడేవారు. నాన్న వుండగా నాకు జీవితం బాగానే గడిచింది. నాకు పెళ్ళి అయింది. అత్తవారింటికి వెళ్ళాను. నేను వెళ్ళిన వరంరోజులకే నా చిన్నమరిది జ్వరంతో వాంతులు అయి చచ్చిపోయాడు. మా అత్తగారికి నామీద అనుమానం! నాలో భూతంయొక్క అంశం వుందని, నన్ను వదిలేయమని నాభర్తని పోరుపెట్టింది. తల్లిమాట జవదాటని నాభర్త నన్ను వదిలేశాడు. పుట్టింటికి వచ్చేసరికి పరిస్థితులు తారుమారయినాయి. నాన్న అనారోగ్యంపాలు అయాడు. నేనే అక్కడా, యిక్కడా పనిచేసివచ్చి ఆయనని పోషించవలసి వచ్చింది. నేను ఆవూరి షావుకారు యింట్లో పనికి కుదిరాను. నా ఖర్మం ఏమిటోగాని, ఆవిడ ప్రసవించలేక చచ్చిపోయింది. అందరికీ నామీదనే అనుమానం పట్టుకుంది. ఊరంతా నామీద భూతం వుందని వదంతు ప్రాకటంతో, ఎవ్వరూ పనికి పెట్టుకోలేదు. నేను వయసులో వున్నాను. ఊరి పటేలు నన్ను లోబరచుకున్నాడు. దరిద్రం భరించలేక నేను అతనికి లొంగిపోయాను. నాకు యిల్లు బాగానే సాగిపోతోంది. ఊరిలో అందరూ భూతమే నాకు అన్నీ తెచ్చియిస్తోందని చెప్పుకోసాగారు. నాన్న చనిపోయాడు. నేను ఒంటరిదాన్ని అయిపోయాను. పటేలు మరోవ్యక్తితో సంబంధం పెట్టుకోవడంతో, నామీద ఆసక్తి సన్నగిలి

పోయింది. నాపరిస్థితి మరీ అధ్వాన్నమైంది. అప్పూరి గణాచారి నన్ను దగ్గరకు తీశాడు. నాలో భూతం వుందని, అది నన్ను తక్కువగా చూస్తే వూరినే నాశనం చేస్తుందని పుకారు పుట్టించాడు. ఊరివాళ్ళు యిది నమ్మారు. నన్ను యిదివరకులా బాధించటం మానేశారు. గణాచారి భార్యకి నాకు, అతనికివున్న సంబంధం తెలిసింది. ఒకరోజు నేను యింట్లో పడుకుని వుండగా, నా యింటిని తగలపెట్టించింది. గణాచారి యిది ముందే తెలిసి, నన్ను ప్రమాదంనుంచి తప్పించి, ఈ అడవిలోవున్న యీ పాడుబడ్డ దేవాలయంలో దాచాడు. నేను దెయ్యాన్ని అయ్యానని చెప్పాడు. ఊరివాళ్ళ యిళ్ళల్లో అందినవన్నీ ఎత్తుకుపోయి, యిక్కడకితెచ్చి దాచుతున్నాడు. అవి ఒకటేమిటి చీరెలు, కోళ్ళు, మేకలు, ధాన్యం – అన్నీ వుంటున్నాయి. అతనికి యిది వ్యాపారం అయిపోయింది. నన్ను బైటకి రావద్దంటాడు. నేను దెయ్యంగా మారి, ఇక్కడ అడవిలో తిరుగుతున్నానని పుకార్లు పుట్టించడంతో ఇటు ప్రక్కల ఎవ్వరూ రావటంలేదు. మొదట మొదట, యిది బాగానేవున్నా యిప్పుడిప్పుడు నాకు భయంవేస్తోంది. నాకు దిక్కులేదు. ఈఊరుతప్ప మరో ఊరికి దారికూడా నాకు తెలియదు! నెలరోజులుగా అతనితో నేనిలా వుండనని, నా కేదయినా మార్గం చూపమని ఒకటే పోట్లాడుతున్నాను. ఛీ! భగవంతుడు నన్ను ఎందుకిలా పుట్టించాడో?'

కన్నీటి చారికలతో నిండివున్న సావిత్రి ముఖం చూస్తుంటే నాకు జాలివేసింది. ఆమె కళ్ళలో నిస్సహాయత, దీనత్వం చూస్తే నా మనసు కరిగిపోయింది. ఎంత భయంకరమైన కథ. నిజమే! ఒక్కొక్కరి జీవితాలని భగవంతుడు ఎందుకిలా క్రూరంగా మలుస్తాడు అనిపించింది.

'గణాచారి మీగురించి చెప్పాడు. జాగ్రత్తగా వుండమని హెచ్చరించాడు. మీరు కెమెరాతో యీ అడవిలో తిరుగుతున్నారని, నా ఫోటో తీస్తే ప్రమాదం అని, పగటివేళ నీళ్ళకి వెళ్ళవద్దని శాసించాడు.'

'మరి కుక్క అరుపుతో వినిపించే ఆ భయంకరమైన శబ్దం ఏమిటి?'

'అదా! అది, జనాన్ని హడలగొట్టించటానికి, గణాచారే నాకు నేర్పించాడు. ఆ కుక్క నాకు బుద్ధితెలిసినప్పటినుంచీ నాదగ్గరే వుంది. రెండురోజుల క్రితమే పాము కరిచి చనిపోయింది. కుక్క నాదగ్గరుంటే నాకెంతో ధైర్యంగా వుండేది. ఇప్పుడు అదికూడా లేదు' సావిత్రికి ఏడుపు ముంచుకువచ్చింది.

నేను సావిత్రిదగ్గరగా వెళ్ళాను.

'సావిత్రీ! నువ్వు ధైర్యంగా ఒకపని చేయగలవా?'

'ఏమిటది?'

'నాతో వచ్చెయ్యి. నేనుండగా నీకేం భయంలేదు. గణాచారి సంగతి వూరిలో అందరికీ చెప్పి బాగా తన్నించి బుద్ధి చెబుదాం.'

'అమ్మో! నేనా! ఆ వూరివాళ్ళంటేనే భయం.'

'నీకేం ఫర్వాలేదు. నేనున్నాను!'

'మీరు ఎల్లకాలం నాతో వుండరుగా. మీ పని అవగానే వెళ్ళిపోతారు.'

'నిజమే. కానీ వెళ్ళేముందు నీకు ఏదయినా మార్గం చూపించి వెళతాను. సరేనా?'

సావిత్రి జవాబు చెప్పలేదు. అపరిచితుడైన నన్ను నమ్మాలా వద్దా అన్న మీమాంసలో పడినట్లుగా చూస్తోంది.

'ఏమంటావు?'

సావిత్రి జవాబు చెప్పబోతుండగా యింతలో దూరంనుంచి 'హరోం హరహర' అన్న సర్వం వినిపించింది.

సావిత్రి కళ్ళు పెద్దవైనాయి! 'గణాచారి వస్తున్నాడు. యిప్పుడెలా' అంది. నేను చుట్టూ చూశాను. ఆ గుడికి ఒక్కటే గుమ్మం వుంది. అందులోనుంచే అతను లోపలికి వస్తాడు. నేను బైటకి వెళితే, అతనికి ముఖాముఖి ఎదురవక తప్పదు.

సావిత్రి ఖంగారుపడిపోతోంది. 'మీరు విగ్రహం వెనక దాక్కోండి' అంది.

నేను తటపటాయించే అవకాశంలేదు. చటుక్కున అటు వెళ్ళాను. మోకాళ్ళమీద కూర్చున్నాను.

గణాచారి లోపలికి వచ్చాడు. 'సావిత్రీ! నిద్రపోయావా?'

'లేదు. ఏమిటి మళ్ళీ వచ్చారు?'

'వెండికుందులు తీసుకువెళ్ళటం మరిచాను. రేపు హైదరాబాద్ వెడ్తున్నాను. అక్కడ అమ్మి వస్తాను.'

'దొంగతనం చేసేది మీరు – దొంగతనం అంటగట్టేది నాకు. అవునా?'

గణాచారి నవ్వాడు – 'నీకు కాదు! దెయ్యానికి. గర్భగుడిలో వెండి కుందులు దెయ్యం మాయం చేసిందంటే జనం నోరెత్తరు. గణాచారి తీశాడంటే బావబాదుతారు.' అతను వెండికుందులు చేత్తో పట్టుకుని నవ్వాడు.

కాళికాదేవి నడుంకి చేయిపెట్టుకుని వుంది. ఆ చేయి ఒంపు మధ్యలో నుంచి నా కెమెరాలో సావిత్రి, గణాచారి జంటగా చక్కగా కన్పిస్తున్నారు. నేను అదును చూసి చటుక్కున మీటనొక్కాను. ఫ్లాష్ ఒక్కసారి తటిల్లతలా మెరిసి ఆరిపోయింది.

గణాచారి కళ్ళుచిట్లించాడు. 'అబ్బా, ఏమి టావెలుగు?'

'బైట మెరుపు మెరిసిందేమో!' అంది సావిత్రి గాభరాగా.

'బైట మెరిస్తే యిటునుంచి ఎలా వస్తుంది' అన్నా డతను మౌనంగా.

'పొద్దుపోతోంది, మీరు వెళ్ళండి.'

అతను సావిత్రిని ఎగాదిగా చూశాడు. 'ఏమిటి విశేషం! ఎప్పుడూ వుండమని గొడవచేసేదానివి, వెళ్ళమని తొందర చేస్తున్నావు!'

అతను అనుమానంగా కాళికా విగ్రహంవైపు వచ్చాడు.

నేను యిక లాభంలేదని తెలియగానే, విగ్రహం వెనకనుంచి అతనికి ఎదురుగా వచ్చాను. నన్ను చూడగానే గణాచారి దిగ్భ్రాంతి చెందాడు.

'నువ్వా !' అన్నాడు. ఆ వెంటనే కాళికాదేవి చేతిలోనున్న త్రిశూలం గభాల్న లాగాడు. అది నా కత్తుకలో గుచ్చుకుపోవాల్సిందే. తృటిలో తప్పిపోయింది. నాకు యిలాటి దెబ్బలాట లేమీ కొత్తగాదు. ఇద్దరం చిత్తుగా తన్నుకున్నాం. ఆ తన్నులాటలో నన్ను చంపటానికి ప్రయత్నిస్తున్న గణాచారిని సావిత్రి పిచ్చిబలంతో విడిపించి దూరంగా తోసింది. ఆ తోపుకి అతను వెళ్ళి మండుతున్న పొయ్యిమీద పడ్డాడు. మరుక్షణం అతను పెట్టిన కేకకి ఆ గుడి, అడవి అంతా మారుమ్రోగింది.

* * *

సావిత్రి చనిపోలేదని, బ్రతికే వుందని, అడవిలో వున్నది దెయ్యం కాదనీ తెలిసేసరికి ఆవూరి ప్రజలు ముక్కుమీద వేలేసుకొన్నారు. గణాచారి పొయ్యిలోపడి ముఖం అంతా కాలి, కళ్ళు పోయేటందుకు సిద్ధంగా వున్నాడు కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే అతనికళ్ళు ఊడపెరికేవారేమో !

నన్ను ప్రశంసలతో ఆకాశానికి ఎత్తారు.

'హరినీ ! అన్నంతపనీ చేశావుకదా ! దెయ్యాల్ని మొత్తానికి చూశావు' అంది అత్తయ్య.

'అత్తయ్యా ! అంటే నీకు కోపంగానీ మీ మూర్ఖత్వంమీద నాకు చెడ్డ చిరాకు వస్తుంది. చీకటే వుంటుందనుకో ! ఎవరో ఒకరు ధైర్యంచేసి అగ్గిపుల్ల వెలిగిస్తే వెలుగువస్తుంది. ఆ వెలుగులో ఏది ఏమిటో తెలుస్తుంది. ఈ వూరిలో యింతమంది వున్నారు. దెయ్యం అంటే దెయ్యమే కాబోలు అనుకున్నారుగాని, ఆ దెయ్యం ఎక్కడుందీ, ఎలా వుందీ చూడాలని ఎవరూ అనుకోలేదు. మనవాళ్ళ ఛాందస భావాలకి నాకు ఒళ్ళుమండిపోతుంది. కామన్‌సెన్స్‌తో ఆలోచించనే ఆలోచించరు. ఈ పాతభావాలమీద వివేకం అనే వెలుగువర్షం పడేదెప్పుడో, ఈ దేశానికి విముక్తి ఎప్పుడో !'

అత్తయ్య మాట్లాడలేదు. మౌనంగా వుండిపోయింది.

మామయ్య పనివున్నట్టుగా లేచి వెళ్ళిపోయాడు.

'నేను రేపు వెళుతున్నానత్తయ్యా' అన్నాను.

నేను సావిత్రి కిచ్చిన వాగ్దానం మర్చిపోలేదు. ఈ ఊరిలోవుంటే సావిత్రి గడపబోయే జీవితం ఎలా వుంటుందో నేను ఊహించలేనిదేంగాదు.

సావిత్రిని నేను బైలుదేరదీశాను.

ఊరివాళ్ళంతా ఈ ప్రయాణపువార్త విని చెవులు కొరుక్కుంటున్నారని నాకు తెలుసు. అది అత్తయ్యకు తలవంపులుగా వుందనికూడా తెలుసు. 'ఆ అమ్మాయిని ఆ ఊబిలోనుంచి బైటకు లాగావుగా! అది చాలదూ! ఆ తర్వాత సంగతి నీ కెందుకురా?' అంటూ సణిగింది.

'అలా అనుకోవటంలోనే వస్తుంది, పేచీ అంతా. ఆ అమ్మాయికి నేను సాయం చేయగలిగినప్పుడు ఎందుకు చేయకూడదూ. సావిత్రిని ఈ ఊళ్ళో నిరాధారంగా వదిలేస్తే, ఆ అమ్మాయిని నేను రక్షించిన ప్రయోజనమే వుండదు' అన్నాను.

'నువ్వు చాలా మొండివాడివిరా సంజయ్!' అంది అత్తయ్య.

'నమ్మకాలని అమలుపరచాలంటే, జీవితంలో చాలా మొండితనం కావాలి అత్తయ్యా!' అన్నాను.

సావిత్రిని హైదరాబాదు తీసుకువచ్చి హోమ్‌లో చేర్పించాను.

ఆరునెలల తర్వాత —

ఆరోజు రాఖీపౌర్ణమి.

నాచేయి అప్పటికే రాఖీలతో నిండిపోయింది.

సాయంత్రం అయింది. నేను విందుభోజనాలు ముగించుకుని ఆలస్యంగా ఇంటికి వచ్చేసరికి నా టేబిల్‌మీద ఒక కవరు వుంది.

అందులో రాఖీవుంది, ఒక ఉత్తరం వుంది.

'అన్నయ్యగార్కి !

సావిత్రి నమస్కారాలు. ఈరోజు రాఖీపౌర్ణమి. అన్నాచెల్లెళ్ళకి ఎంతో పవిత్రమైనరోజు. నాకు అన్నలు లేరుకదా అని దుఃఖపడ్డాను. మీరు గుర్తుకువచ్చారు. నాకు అన్నయ్య లేకపోవడం ఏమిటి అనుకున్నాను. ఈ రాఖీ మీకు పంపిస్తుంటే నాకెంతో ఆనందంగా వుంది. నాలాటినిర్భాగ్యురాళ్ళయిన ఆడపిల్లలకి ఈ దేశంలో అడుగడుగునా మీలాటి అన్నగార్లు వుంటే ఎంత బాగుంటుంది! అప్పుడు ఆడవాళ్ళకి జీవితం యింత భయంకరంగా వుండదేమో! నాలాటి దురదృష్టవంతురాలున్న ప్రతిచోటా మీలాటి ధైర్యవంతులు వుండాలని మనసారా భగవంతుని ప్రార్థిస్తున్నాను! నేను ఈ హోమ్‌లో ఎంతో హాయిగా, ఆనందంగా వున్నాను. మీకు నా కృతజ్ఞతలు.

ఇట్లు
సావిత్రి.'

ఆ ఉత్తరం చదవటం పూర్తిచేసేసరికి నాకళ్ళు చెమ్మగిలినాయి. నేను ఆ రాఖీని ఎంతో అపురూపంగా చేతికి కట్టుకున్నాను. నాకు ఆ రాఖీని చూస్తుంటే ఫోటోగ్రఫీలో ప్రెసిడెంట్ దగ్గరనుంచి గోల్డుమెడల్ అందుకున్నప్పటికంటే ఆనందంగా, గర్వంగా అనిపించింది.